బాలసాహితి:

# మనసులోని మాట

పిళ్లా సుబ్బారావు శాస్త్రి

ఆ నగరంలో పెద్ద పేరుగల వ్యాపారి నారాయణ్ సేఠ్ ఎన్నో ఏళ్ళనుండీ వ్యాపారం సాగిస్తున్నాడు. అతని తాత తండ్రులు కూడా ఆ నగరంలో పుట్టినవాళ్లే! నగరంలో పెద్దపెద్ద వారంతా అతని కొట్టుకే వచ్చేవారు. అతని దగ్గర కొన్న వస్తువు అంటే—ఎవరూ వ్యాఖ్యానించేవారు కాదు! "చాలా బాగుంది!" అని ఊరుకునేవారు. మరికొందరయితే, వస్తువు చూసి... అతనినిగురించీ, అతని తాతను గురించీ చెప్పుకొచ్చేవారు.

సేఠ్ దగ్గర మోహన్‌లాల్ అనే గుమాస్తా ఉండేవాడు. మోహన్‌లాల్ చాలా బీదవాడే! కాని...అతనంటే సేఠ్‌కెంతో నమ్మకం! పెద్దపెద్ద ఖాతాదారుల యిళ్లకు పెద్ద మొత్తాలు వసూలు చేసుకురావడానికి అతన్నే పంపేవాడు. లాల్ ఎంత అంటే...అంతే! ఏనాడూ లాల్‌ని లెఖ్ఖ అడిగేవాడు కాదు సేఠ్. పుస్తకాల్లో లాల్ లెఖ్ఖలు వ్రాయడమే కానీ...అవి ఏనాడూ సేఠ్ చూసి ఎరుగడు! లాల్ కూడా సేఠ్‌కి తెలియకుండా కాని — లెక్కలు తప్పులు రాసి... దమ్మిడీ అయినా తీసి ఎరుగడు!! ఎంత ప్రాణం మీదకు వచ్చినా...ముందు సేఠ్‌ని యింత తీసుకుంటానని అడిగేవాడు. అందుకు సేఠ్ కూడా కాదనేవాడు కాదు. మోహన్‌లాల్ తన కష్టార్జితం తనకుంటే చాలు అనుకునేవాడు.

ఒకనాడు మోహన్‌లాల్ భార్య అన్నది—"ఏమండీ! ఇన్నేళ్ళుగా సేఠ్ దగ్గర పనిచేస్తున్నారు కదా... ఒక్కదమ్మిడీ అయినా మిగిల్చారా? అమ్మాయికి చూస్తే పెళ్లీడు వస్తోంది కదా! అబ్బాయి చూస్తే పెద్ద చదువు చదువుతానంటున్నాడు. పోనీ ... వాణ్ని చదువు మానిపించి, ఏదో పనిలో పడేస్తాం! కానీ ... అమ్మాయిల పెళ్లిళ్ళు ఆపలేము కదా! ఈ రోజుల్లో ఎంత బీదవాడయినా పెళ్ళి అంటేనే ... 'కట్నం కావాలి' అంటున్నాడు -"

ఆమె యింకా ఏమో అనబోతో వుండగానే—"ఇంతకీ...నీ వనే మాటేమిటి?" అన్నాడు కొంచెం చిరాకుగా.

"ఇదిగో...మీరు యిలా చిరాకు పడతారనే, ఇన్నేళ్ళుగా ఈ విషయమే కాదు — ఏ విషయమూ మీతో చెప్పడం మానుకున్నాను. మీరలా చిరాకు తెచ్చుకుంటే—"

"ఇంతకీ నువ్వనే మాటేమిటి?" అన్నాడు జాలిగా—"అదికాదండీ! పిల్లలిద్దరూ పెద్దవారవుతున్నారు కదా! వాళ్ళ పెళ్ళికి ... ఏదయినా వెనకేసుకుంటే పనికి వస్తుంది!" అన్నాదావిడ.

"ఇప్పటినించీ ... ఈ ప్రయత్నం ఎందుకూ? ఆ వేళ వచ్చేసరికి అన్నీ అవే సునాయాసంగా జరిగిపోతాయి. ఎలాగూ...ప్రతీ నెలా సేఠ్ ఐదు రూపాయలు జీతంలో తీసివుంచుతున్నాడు కదా!" అన్నాడు లాల్.

"ఎక్కడి ఐదు రూపాయలండీ! ఒక పిల్ల పెళ్ళికే ఐదువేలు కావలిసి వస్తోంటే...!"

"ఐదువేలు కాకుంటే...పదివేలు కానీ!—నీ మనసులో ఉన్నమాట మాత్రం అర్థం అయింది. అది మాత్రం చచ్చినా...నే, చెయ్యను!" అని నిర్మొగమాటంగా, సూటిగా చెప్పేశాడు లాల్. తిరిగి తానే అన్నాడు—"అయినా, ఒకరిడబ్బు మనకెందుకూ? మన డబ్బు మనకి ఉంటే—అదే చాలు!" అని.

ఇంటిదగ్గర అలాగన్నాడేగానీ - భార్య చెప్పిన మాటలు చెవులో గింగురుమంటూనే వున్నాయి. అవి నిజంగానే తోచినయి. దుకాణంలో కూర్చున్నంతసేపూ - ఏదో భారం అతనివీపుమీద వున్నట్టుగావున్నది. గతాన్ని గుర్తుకు తెచ్చుకొని-విచారించాడు. ఏవేవో ఆలోచించాడు. తర్జనభర్జన పడి చివరకు ఒక నిర్ధారణకు వచ్చాడు లాల్. ఆ వారంలో ఎలాగయినా—ఐదువందలు రూపా

బాలగేయం:

# తీరని కోరిక

## అలపర్తి వెంకటసుబ్బారావు

కలడు 'ఢిల్లీ' పట్టణమున
కౌశికుడను బ్రాహ్మణుండు!
చదువు అతని కసలు రాదు
మది దీరని కోర్కెగలదు !!

పండితు డనిపించుకొనగ
పరితపించు సతత మతడు!
తీరదాయె నా కోరిక
తీరు దెలియ కతడు తుదకు

వీరబలుని సమీపించి
విన్నవించె దన కోరిక !
జాలిదలచి వీరబలుడు
సలహా యిటు లిచ్చినాడు :

"దారులన్ని కలియుచోట
కూరుచుండు నీవు వెళ్ళి,
అచట నిన్ను ఎవ్వరైన
అన్నయెడల పండితుడని

కొట్టబొమ్మ తరిమి తరిమి!
కొద్దికాల మటుల జేయ
పండితు డను పేరు నీకు
ఉండిపోవు శాశ్వతముగ!"

వీరబలుని మాటమీద
గుఱి కుదిరిన బ్రాహ్మణుడు
మరునాడే కూర్చుండెను
దారులన్ని కలియుచోట!

ఇంతలోన వీరబలుడు
కొంతమంది బాలకులను
పంపినాడు బ్రాహ్మణుని
పండితుడని పిలువమనీ!

బాలు రటుల పిలువగానె
బ్రాహ్మణుండు కొట్టబోయె!
ఇది జూచిన బాలకులకు
మది నుత్సాహంబు గలిగి

అదేపనిగ బ్రాహ్మణుని
అనసాగిరి పండితు డని!
ఇట్టె నాల్గురోజు లవగ
పట్టణమున నివసించెడి

పెద్దపెద్దవారుగూడ
పిలచినారు పండితుడని!
తీరె పాప మతని కోర్కె
వీరబలుని సలహాపై!!

## ★ మనసులోని మాట ★

యలుకు తప్పడు లెక్కలు వ్రాయాలనుకున్నాడు. అదీ అతని నిర్ణయం.

మఱో విశేషం!—అదే రోజున సేఠ్ అలా మడతకుర్చీలో పడుకొని ఏవేవో ఆలోచించాడు—మోహన్‌లాల్ తన దగ్గర గుమాస్తా పని చేస్తూ...పాతికేళ్లుపైనే అయింది. ఈ పాతికేళ్ళలో ఏం రాశాడో... ఏం చేస్తున్నాడో ఒక్కనాడు కూడా... పుస్తకాలు తీసి లెక్కలు చూడలేదు! మోహన్ మంచివాడయినా అతని లెక్కలు చూడడం మాత్రం తన కర్తవ్యం అనుకున్నాడు. వెంటనే నౌకర్‌ను పిలిచి "బండీ సిద్ధం చెయ్యి" అన్నాడు.

ఇక దుకాణంలో మోహన్‌లాల్ గుండె నిబ్బరం చేసుకొని...ఐదువేల రూపాయలూ ఇనప్పెట్టినుంచి తీశాడు! చేతులు వణికినయ్! ఏదో భయం వేసింది!!—"సేఠ్‌కి నేనంటే ఎంతో నమ్మకం! పాతికేళ్ళనుంచీ, యీ కొట్లో పనిచేస్తూ, సేఠ్ డబ్బు తిని సేఠ్‌కి ద్రోహం చెయ్యడం!—అంత నీచపు పని మరొహాటి లేదు. సేఠ్ ఒకవేళ...వచ్చి లెక్కలు అడిగితే — తప్పక దొరికిపోతాను!... పాతికేళ్లనుంచీ యీ పని చేస్తున్నానని సేఠ్‌కి అనుమానం తప్పక కలుగుతుంది! వెంటనే నన్ను పనిలోనుంచి తొలిగిస్తే—తిరిగి యిటువంటి పని చేసిన నాకు ఉద్యోగం దొరకదు! అయినా—ఇంత వయస్సు వచ్చిన తర్వాత కోరి పాపాన్ని తెచ్చుకున్నవాణ్ని అవుతాను. ఈ పని యీ జన్మలో చెయ్యను. లక్ష్మీదేవి తోడు...!" అంటూ, ఐదువేలు చేతిలో పెట్టుకొని 'ఒట్టు' పెట్టుకొని ఆ డబ్బుని తిరిగి ఇనప్పెట్టెలో పెట్టేశాడు!

సేఠ్ సగం దూరం వచ్చిన తరువాత అనుకున్నాడు—"లాల్‌ని నేను పాతికేళ్లనుంచీ లెక్కలు అడిగి ఎరుగను. ఇవాళ హఠాత్తుగా లెక్కలు అడిగితే...లాల్ బాధపడవచ్చు. ఈ అవమానంతో పని మానేస్తే—నాకు తిరిగి అంత నమ్మకస్థుడు దొరకడు! లెక్కలు అడిగి అతన్ని బాధపెడితే—అంత మంచిది కాదు!" అని వెంటనే బండిని ఇంటికి తిప్పించేశాడు.

మోహన్‌లాల్ డబ్బు ఇనప్పెట్టెలో పెట్టేశాడు! సేఠ్ బండిని యింటికి తిప్పించేశాడు—తిరిగి నాటి నుంచీ నేటివరకూ లాల్‌కి అటువంటి కోరికలు కలుగనూ లేదు! సేఠ్ లెక్కలు చూడనూ లేదు!! ★